క్లుప్తంగా

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ



చల్లపల్లి: మండల పరిధిలోని పురిటిగడ్డ ప్రాథమిక పాఠశాల బాలబాలికలకు హైదరాబాదుకు చెందిన సుంకర ఆదిత్యారామ్ ఆర్థిక సహకారంతో రూ.13 వేలు విలువగల విద్య, క్రీడా సామగ్రిని శుక్రవారం అందజేశారు. ఆదిత్యారామ్ కుటుంబ సభ్యులు సుంకర గాంధీ ప్రసాద్, శారదాదేవి ముఖ్య అతిథులుగా పాల్గొని సామగ్రి అందజేశారు. ఎంఈవో–2 పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి ఇలా విద్యార్థులకు చేయూతనందించటం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు దేవరపల్లి సురేష్ బాబు, బి.నాగలక్ష్మి, జి.కోటేశ్వరమ్మ, గ్రామ పెద్దలు నాదేళ్ళ సుధాసాగర్, హేమలత, ఎం.నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కోనేరుసెంటర్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గోవిందరావు శుక్రవారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు చిన్నాపురం, వాడపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు సరఫరాను నిలుపుదల చేస్తామని పేర్కొన్నారు. వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

అగ్నిప్రమాద బాధితుడికి ఆర్థిక సహాయం

ఎడ్లంక(అవనిగడ్డ):మండల పరిధిలోని ఎడ్లంకలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం పోగొట్టుకున్న మునిపల్లి బాలస్వామి కుటుంబానికి మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దోవా గోవర్ధన్ నిత్యావసర సరుకులు, నగదు అందించారు. శుక్రవారం బాధితుడి ఇంటికెళ్ళిన గోవర్ధన్ నిత్యావసర వస్తువులు, రూ.7 వేలు నగదుని బాలస్వామికి అందించారు.

విద్యార్థులకు స్టీలు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ



చిలకలపూడి(మచిలీపట్నం):నగరంలోని హైనీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం స్టీలు ప్లేట్లు, గ్లాసులను పంపిణీ చేశారు. ఏఆర్ ఎస్సై కెఎన్వీ ప్రసాద్ ఆర్థిక సాయంతో పాఠశాలలోని విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ తాను పోలీస్‌శాఖలో 40 సంవత్సరాలుగా విధి నిర్వహణ చేస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టానన్నారు. హైనీ హైస్కూల్ ప్రతినిధి ఎల్ మోజెస్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం వ్యాఖ్యలు అప్రజాస్వామికం

ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు సదర్‌రుద్దీన్‌ఖురేషి

మచిలీపట్నంటౌన్: కూటమి పాలకులు ఇచ్చిన మేనిఫెస్టోలోని హామీలను అమలు చేయాని మాట్లాడితే తాటతీస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొనటం అప్రజాస్వామికమని ముస్లిం సంక్షేమ సంఘం ఉమ్మడి రాష్ట్ర నాయకుడు ఎండీ సదర్‌రుద్దీన్‌ఖురేషి అన్నారు. ఈమేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన జారీ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజల సమస్యల పై ప్రశ్నించే హక్కు ప్రతిపక్షాలకు లేదా అని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు మాట్లాడే మాటలకు అర్థం లేదన్నారు. హామీలను పూర్తిగా అమలు చేయలేనపుడు మేనిఫెస్టో ఎందుకు ప్రకటించారని నిలదీశారు. సంక్షేమ పథకాలు ఇష్టం వచ్చినట్లు ఇస్తే ప్రజలు గాని, వారి తరపున పోరాటం చేసే వైఎస్సార్ సీపీ మిన్నకుండలా, ఇదేనా మీ పాలన అని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిపై అవగాహన



కృత్తివెన్ను:కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సంయుక్తంగా సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలించే ప్రక్రియ మొదలైందని దీనిపై అవగాహన కల్పిస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యులు సాయిసందీప్ అన్నారు. మండలంలోని పల్లెపాలెం, లక్ష్మీపురం, కృత్తివెన్ను పాఠశాలల్లో శుక్రవారం దీనిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీవైఈవో ప్రభావతి, పద్మ, రాజేంద్రప్రసాద్, సత్యవతి, ఉపాధ్యాయులు సూర్యప్రకాష్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులంటే అంత చులకనా?

- నాణ్యత లేని పౌష్టికాహార సరుకులు, చిన్న పరిమాణంలో గుడ్లు
- సరఫరా తీరును తప్పు పడుతున్న చిన్నారుల తల్లిదండ్రులు



అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ నెలలో సరఫరా అయిన చిన్న పరిమాణంలోని గుడ్లు

మచిలీపట్నంటౌన్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, బాలింతలు, గర్భిణులకు అందజేస్తున్న పౌష్టికాహారం, గుడ్లు నాణ్యత లేకుండా, సరైన పరిమాణం లేకుండా అందిస్తున్నారని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఐసీడీఎస్ అధికారుల పర్యవేక్షణ లోపంతో మచిలీపట్నం నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యతలేని సరుకులు, గుడ్లు సరఫరా చేస్తున్నారని అంటున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న సరకులు సక్రమంగా, నాణ్యతతో వస్తున్నదీ లేనిదీ పర్యేక్షించేవారే లేరనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అందువల్లే గుడ్లను సరఫరా చేసే కాంట్రాక్టర్‌లు వారికి ఇష్టం వచ్చినట్లుగా నాణ్యతలేని, సరైన పరిమాణం లేని గుడ్లను సరఫరా చేస్తున్నారని వాపోయారు. మచిలీపట్నం నియోజకవర్గం పరిధిలో 176 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా 11 వేల మంది చిన్నారులు, 8 వేల మంది గర్భిణులు, బాలింతలకు ఈ నాణ్యతలేని సరుకులు, గుడ్లనే సరఫరా చేస్తున్నారు. నాణ్యత లేని గుడ్లు ఇస్తుండటంతో తాము వాడేలోపే పాడైపోతున్నాయని, మరీ చిన్న సైజు గుడ్లు ఇస్తున్నారని చిన్నారుల తల్లిదండ్రులు, బాలింతలు, గర్భిణిలు చెబుతున్నారు. మచిలీపట్నం నియోజకవర్గంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు ఇలాంటి గుడ్లనే కాంట్రాక్టర్ సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నాడని పేర్కొంటున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లను సరఫరా చేసే కాంట్రాక్టర్ ఐసీడీఎస్‌లో పని చేస్తున్న ఓ సూపర్‌వైజర్ భర్త కావటంతో గుడ్లు ఎలా సరఫరా చేసినా అధికారులు పట్టించుకోవటం లేదనే ఆరోపణలు వచ్చాయి. జిల్లా నుంచి, ప్రాజెక్టు స్థాయి వరకూ ఉన్న అధికారులకు మామూళ్లు అందుతుండటంతో కాంట్రాక్టర్ ఎలాంటి గుడ్లు సరఫరా చేసినా పట్టించుకోవటం లేదనే వాదన వినిపిస్తోంది. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న కర్జూరం, అటుకులు, కందిపప్పు, చిక్కి వంటివి కూడా నాణ్యత లేకపోవటంతో తాము తినలేకపోతున్నామని లబ్ధిదారులు అంటున్నారు. ఇకనైనా అంగన్‌వాడీ కేంద్రాలకు పెద్ద పరిమాణంలో మంచి నాణ్యమైన గుడ్లు, సరుకులు సరఫరా అయ్యేలా జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

కాంట్రాక్టర్‌కు బిల్లు తగ్గిస్తాం

చిన్న పరిమాణంలో గుడ్లు, నాణ్యతలేని సరుకులు పంపిణీ విషయాన్ని లబ్ధిదారులు తమ దృష్టికి తెస్తే వాటిని మార్చి ఇస్తాం. గుడ్లు నాణ్యత లేకపోయినా, సరైన పరిమాణంలో సరఫరా చేయకపోయినా కాంట్రాక్టర్‌కు బిల్లు తగ్గిస్తాం. తగిన చర్యలు తీసుకుంటాం.
– గ్లోరీ, ఐసీడీఎస్ సీడీపీఓ, మచిలీపట్నం



నాణ్యతలేని కర్జూరం

పేర్ని నానికి కృతజ్ఞతలు



పేర్నినాని ని కలసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డెప్యూటీ మేయర్ శీలం భారతి- బాబ్జీ దంపతులు

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సీపీ మహిళా విభాగం కృష్ణా జిల్లా అధ్యక్షురాలిగా నియమింపబడ్డ తర్వాత శుక్రవారం రాత్రి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్నినానిని శీలం భారతి- బాబ్జీ దంపతులు మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. నగరపాలక సంస్థ డెప్యూటీ మేయర్‌గా పని చేస్తున్న శీలం భారతిని మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా నియమిస్తూ ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. ఆ సమయంలో ఆమె విదేశీ పర్యటనలో ఉన్నారు. విదేశీ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన తర్వాత శుక్రవారం రాత్రి భారతి, ఆమె భర్త మాజీ కౌన్సిలర్ బాబ్జీ పేర్నినానిని ఆయన గృహం వద్ద కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు వారు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. తనపై నమ్మకముంచి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా నియమించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పేర్నినానిలకు వారు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

నూతన వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని వినతి



బీసీ వెల్ఫేర్ అధికారి రమేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

చిలకలపూడి(మచిలీపట్నం):మచిలీపట్నం నగరంలో వెనుకబడిన తరగతులకు చెందిన మరొక నూతన వసతిగృహాన్ని ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు శేకుబోయిన సుబ్రహ్మణ్యం కోరారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సాధికారిత జిల్లా అధికారి జి.రమేష్ కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. నూతన వసతి గృహం ఏర్పాటు చేయటంతో పాటు గుడివాడ, పెనమలూరు, గన్నవరంలలో మూసివేసిన వసతి గృహాలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కృష్ణా యూనివర్సిటీకి సంబంధించి విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో చేరిన దృష్ట్యా వారి కోసం వసతి గృహాలను ఏర్పాటు చేసి సదుపాయాలను కల్పించాలని విన్నవించారు. వీటితో పాటు విద్యార్థులు మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో బీసీ స్టడీ సర్కిల్ ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు జోగి శివ, చింతపట్ల నాని, భోగిరెడ్డి సుభానీ, ఎం రామరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన



చల్లపల్లి ప్రధాన సెంటర్లో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయులు

చల్లపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సీఐటీయూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చల్లపల్లి ప్రధాన సెంటర్లో శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ గతంలో మాదిరిగానే రోజుకు ఎనిమిది గంటల పనిదినాలను కొనసాగించాలని కోరారు. అలాగే మహిళలకు నైటు షిప్టులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించటంతోపాటు సమాన పనికి సమాన వేతనాన్ని చెల్లించాలని కోరారు. రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, రవాణా రంగంపై తీసుకువచ్చిన జి.ఓ.నెం.21ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల పిల్లలకు కూడా తల్లికి వందనం వర్తింపచేయాలని, పంచాయతీ కార్మికుల టెండర్ విధానాన్ని రద్దుచేసి ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలని విన్నవించారు. కార్యక్రమంలో గీత కార్మిక సంఘం నాయకులు వాకా రామచంద్రరావు, రైతు సంఘం నాయకులు యద్దనపూడి మధు, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శిలు సిహెచ్ గంగాభవాని, మహ్మద్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల నుంచి థాయ్‌లాండ్‌కు బౌద్ధమతం



మ్యూజియం వద్ద థాయ్‌లాండ్‌కు చెందిన ఆర్కియాలజీ రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీసక్రవల్లిభోత్మ బృందం

ఘంటసాల: ఘంటసాల గ్రామం నుంచే బౌద్ధమతం థాయ్‌లాండ్‌కు వ్యాపించినట్లు బౌద్ధ స్తూపం వద్ద ఉన్న ఆధారాలను బట్టి తెలుస్తుందని థాయ్‌లాండ్‌కు చెందిన శిల్పకాన్ యూనివర్సిటీ ఆర్కియాలజీ రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీసక్రవల్లిభోత్మ అన్నారు. ప్రముఖ బౌద్ధక్షేత్రంగా విరాజిల్లుతున్న ఘంటసాల గ్రామంలోని బౌద్ధ స్తూపం, బౌద్ధ మ్యూజియాన్ని థాయ్‌లాండ్‌కు చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీసక్రవల్లిభోత్మ బృందం శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా బౌద్ధ స్తూపం, మ్యూజియంలోని పురాతన విగ్రహాలను పరిశీలించి అధ్యయనం చేశారు. అనంతరం రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీసక్రవల్లి భోత్మ మాట్లాడుతూ బౌద్ధమతం విస్తరణ గురించి అధ్యయనం చేయడానికి భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్‌లో పురాతన భౌద్ధ క్షేత్రాలు, ఆరామాలను సందర్శించి అధ్యయనం చేయడానికి అర్కియాలజీ డిపార్టుమెంట్‌కు చెందిన తొమ్మిది మంది బృందంతో ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు. ఘంటసాలలోని బౌద్ధస్తూపం క్రీ.శ. 3వ శతాబ్దంకు చెందినదిగా ఉందని, చరిత్ర ప్రకారం స్తూపంలో గౌతమ బుద్ధుని దాతువులు, ఇతర వస్తువులు ఉండటాన్ని బట్టి చూస్తుంటే ఘంటసాల నుంచి బౌద్ధ మతం బెంగాల్ మీదగా థాయ్ లాండ్, శ్రీలంక వ్యాప్తి చెందినట్లు తెలుస్తుందన్నారు. ఘంటసాల, థాయ్ లాండ్‌లోని రోమన్ నాణేలు ఒకేలా ఉన్నట్లు గుర్తించామన్నారు. ఘంటసాల గ్రామంలోని అతిపురాతన బౌద్ధ స్తూపాన్ని అధ్యయనం చేయడానికి 87 ఏళ్ల వయస్సులో ఘంటసాలకు రావడం సంతోషంగా ఉందన్నారు. ఏపీలోని నాగార్జునకొండ, అమరావతి, ఘంటసాల, భట్టిప్రోలు, గుంటుపల్లి గుహలు, అనకాపల్లిలోని బొజ్జన కొండ, విశాఖలోని తొట్లకొండ, బావికొండ, శ్రీకాకుళం జిల్లాలోని శాలిహుండం బుద్దునికి సంబందించిన ప్రాంతాల్లో అధ్యయనం చేయనున్నట్లు శ్రీసక్రవల్లిభోత్మ తెలిపారు. ఈబృందానికి కేంద్ర ప్రభుత్వ పర్యాటక శాఖ నుంచి మార్గదర్శకులు (గైడ్)గా కె.కరుణానిధి ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఘంటసాలకు చెందిన బుద్ధిస్టు గొర్రెపాటి రామకృష్ణ, దేవేంద్ర, మ్యూజియం సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

అవనిగడ్డ: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. క్లీంకారా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 50 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో క్లీంకారా ఫౌండేషన్ ఈ జాబ్‌మేళా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ ఎండీ గుడివాక లక్ష్మీ మాట్లాడారు. ప్రిన్సిపాల్ డి.ఉమారాణి, ఫౌండషన్ ప్రతినిధి శివరావ్ తదితరులు పాల్గొన్నారు.

రథయాత్రకు స్వాగతం



ఘంటసాల: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శత జయంతిని పురస్కరించుకుని శ్రీ సత్యసాయి సేవా సంస్థలు నిర్వహిస్తున్న శ్రీ సత్యసాయి ప్రేమ వాహిని రథయాత్ర గురువారం ఘంటసాల గ్రామానికి చేరుకుంది. పలు గ్రామాల మీదుగా రథయాత్ర సాగింది.

నూతన వంతెన ప్రారంభం



పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండల పరిధిలోని పెదకళ్లేపల్లిలో గొర్రుకోడు డ్రెయినేజీపై కొత్తగా నిర్మించిన వంతెనను మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, అవనిగడ్డ శాసన సభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. సీఎస్ఆర్ నిధులు రూ. 40 లక్షలతో రోటరీ కమ్యూనిటీ సర్వీస్ ట్రస్ట్ పర్యవేక్షణలో నిర్మించిన వంతెనను ప్రారంభించారు. అనంతరం గ్రామంలో నూతన కమ్యూనిటీ హాలు నిర్మాణానికి తగిన స్థలాలు పరిశీలించారు. స్థానిక గ్రామ దేవత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చిలకలపూడి పాపారావు, జనసేన మండల పార్టీ అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్, వైస్ ఎంపీపీ కడవకొల్లు సీతారామాంజనేయులు, గ్రామ సర్పంచ్ అరజా సంధ్యారాణి, అరజా కిరణ్‌కాంత్, మెరకనపల్లి నరేష్, బాదర్ల లోలాక్షుడు, తోట కృష్ణాంజనేయులు, అడపా రాంబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్యాన్సర్ పేషెంట్‌కు రక్త దానం



చల్లపల్లి: మండల కేంద్రానికి చెందిన కస్తూరి విజయ్ 74వ సారి రక్తం దానం చేసి మానవత్వాన్ని చాటుకున్నాడు. మూడు నెలలకు ఒక్కసారి బ్లడ్ డొనేట్ చేసే అలవాటు ఉన్న విజయ్ బ్లడ్ అవసరం ఉందన్న సమాచారం తెలిస్తే చాలు రక్తాన్ని దానం చేస్తాడు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న పెడనకు చెందిన అమలేశ్వరీ విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు అత్యవసరంగా బ్లడ్ అవసరం అయింది. అవనిగడ్డకు చెందిన బ్లడ్ డోనర్స్ గ్రూపులో ఈ సమాచారం చూసి స్పందించిన కస్తూరి విజయ్ కుమార్ శుక్రవారం విజయవాడ వెళ్లాడు. బ్లడ్ నుంచి ప్లేట్స్‌లేట్స్‌ను వేరు చేసి సేకరించేందుకు విజయ్ సహకరించి ప్రాణదాతగా నిలిచాడు. వెంటనే వచ్చి రక్తదానం చేసినందుకు అమలేశ్వరీ బంధులు విజయ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కుల గణన నిర్ణయం హర్షణీయం

– బీసీ సంఘ నాయకుడు గద్దంరాజు

మచిలీపట్నంటౌన్: దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేయటం హర్షణీయమని బీసీ సంఘ నాయకుడు గద్దం రాజు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జనగణనతో పాటు కులగణన చేయాలని ఓబీసీ సంఘాలు అనేక రూపాల్లో ఉద్యమాల నిరసనల ఫలితంతో కేంద్ర ప్రభుత్వం స్పందించి ఈ నిర్ణయం తీసుకుందన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఓబీసీల జనాభా కచ్చితంగా తెలిసేలా వెనుకబడిన తరగతులకు చెందిన జాతీయ స్థాయిలోనే 3,746 కులాలు, రాష్ట్రంలోని 139 కులాలకు చెందిన వారి జనాభాతో పాటు కులాల వారీగా వివరాలు తెలియజేయాలని అప్పుడే బీసీ కులాల జనాభా ఎంతో తెలుస్తుందని సూచించారు. కుల గణన సక్రమంగా నిర్వహిస్తే దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల్లో ప్రాముఖ్యత పెరుగుతుందని తెలిపారు. దేశంలో బీసీల జనాభా నిష్పత్తి ప్రకారం పార్టీలు వారికి ప్రాముఖ్యత ఇవ్వాలని కోరారు.

గురుకులంలో ఖాళీలు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

పెడన: మండల పరిధిలోని బల్లిపర్రు గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఉన్న ఖాళీలను భర్తీ చేయడానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎస్.రూతమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో ఎస్సీలు–08, ఎస్టీలు–03, బీసీ–సీ–10, ఓసీ -01 ఖాళీలున్నాయన్నారు. ఏడో తరగతిలో ఎస్టీలు -02, బీసీ సీ -04, 8వ తరగతిలో ఎస్టీలు -03, బీసీ–01, ఓసీ -01, 9వ తరగతిలో ఎస్టీలు -02, బీసీ సీ -01 ఖాళీలున్నాయని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఆధార్, కుల, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు నకళ్లతో పాటు స్టడీ సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజు ఫోటోలతో ఈ నెల 24వ తేదీలోగా పెడన మండలం బల్లిపర్రు గురుకుల పాఠశాలలో లేదా సమీపంలోని గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 25న జి కొండూరు మండలం కుంటముక్కల గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారని చెప్పారు. అలాగే ఐదో తరగతిలో ప్రవేశ పరీక్ష రాసి సీటు కేటాయించబడని విద్యార్థులకు ఈ నెల 22న కుంటముక్కల గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ ద్వారా సీట్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థిలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా గ్రామ దేవతల సంబరాలు



తాళ్లపాలెం చెన్నూరులో గంగానమ్మ తల్లికి హారతులు ఇస్తున్న భక్తులు



లక్ష్మీదేవికి మొక్కుబడులు తీర్చుకుంటున్న భక్తులు

పెడన: మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో గ్రామ దేవతల సంబరాలు అంగరంగ వైభవంగా, అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మహంకాళమ్మ తల్లి, గంగానమ్మతల్లి, అంకమ్మ తల్లి, పోతురాజు, నాగేంద్రస్వామి సంబరాల మహోత్సవాలను ఈ నెల 11వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. శుక్రవారం పదో రోజు కావడంతో గ్రామంలోని గ్రామదేవతల ఆలయం నుంచి ఊరేగింపుగా మేళతాళాలతో బయలుదేరి గ్రామంలో వెలిసిన లక్ష్మీదేవికి మొక్కుబడులు తీర్చారు. అలాగే తాళ్లపాలెం చెన్నూరులో గంగానమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలను సమర్పించి హారతులు ఇచ్చారు. ఈ నెల 22న భారీగా భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలి రానున్నారని, పెడన పరిసర ప్రాంతాల నుంచే కాకుండా జిల్లా, రాష్ట్ర నలుమూలల నుంచి కూడా భక్తులు వచ్చి ఆయా అమ్మవార్లకు మొక్కుబడులు తీర్చుకుంటారని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం చివరి రోజున పోలీస్‌బందోబస్తు కూడా భారీగా ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

నేతన్నలను వంచన చేసిన కూటమి ప్రభుత్వం

దేవాంగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బీరక సురేంద్రబాబు



సురేంద్రబాబుకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికిన వైఎస్సార్ సీపీ పెడన నాయకులు

పెడన:చేనేత కార్మికులైన నేతన్నలను దగా చేయడమే కాకుండా వంచనకు గురిచేసిన ప్రభుత్వం కూటమియేనని దేవాంగ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ బీరక సురేంద్రబాబు అన్నారు. వైఎస్సార్ సీపీ పెడన కార్యాలయంలో స్థానిక వైఎస్సార్ సీపీ చేనేత విభాగం నాయకులతో కలిసి శుక్రవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. సురేంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా పెడన నియోజకవర్గానికి వచ్చామని తెలిపారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేనేత కార్మికులకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.24 వేలు నేతన్న నేస్తం కింద నేరుగా కార్మికుల బ్యాంకు ఖాతలకు జమ చేశారని గుర్తు చేశారు. ఐదేళ్ల పాటు రూ.1.20 లక్షలను వారికి పెట్టుబడి సాయం కింద అందజేసి వారికి అండగా నిలిచారని చెప్పారు. ఎన్నికలకు ముందు చీరాలలో నిర్వహించిన బహిరంగ సభలో నేతన్న నేస్తం పథకం అమలు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఉచిత విద్యుత్ కింద 200 యూనిట్లు వరకు ఇస్తామని స్పష్టం చేశారని, నేటికి అమలు చేయలేదన్నారు. విద్యుత్‌శాఖ ఇచ్చే బడ్జెట్‌ను బట్టి ఈ పథకం అమలు చేస్తామన్నారని, కాని వారు బడ్జెట్ ఎప్పుడు ఇస్తారో కూడా తెలియని దుస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో చేనేత విభాగం నాయకుడు కటకం ప్రసాద్, యద్రా టార్జన్, దొడ్డిపట్ల నాగేశ్వరరావు, పిచ్చిక సతీష్‌బాబు, కర్ణా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలి



కోడూరు సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి

కోడూరు: రైతుల సమస్యలకు సత్వర పరిష్కారం చూపేందుకు రెవెన్యూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని ఇన్‌చార్జి తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. రెవెన్యూ శాఖలో ఉద్యోగులకూ ఇబ్బందులు ఉన్నాయని, వాటిని అధిగమనించి ప్రజల సమస్యల పరిష్కారం కోసం పని చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం శాఖలో పని చేసి పదవి విరమణ పొందిన రిటైర్డ్ వీఆర్వోలు తుమ్మల దేవేంద్ర వరప్రసాద్, జరుగు నాగదేవ్, గాదే కృష్ణబాబులను శాలువాలతో సత్కరించారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు గాదె గీత, దాసి నాగమోక్షిత, విస్సంశెట్టి ప్రణీత శంకర్, ఇమడాబత్తిన పల్లవిని సత్కరించి, రూ.20 వేల నగదు బహుమతిని అందించారు.

పెడన: రెవెన్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో ఇన్‌ఛార్జి తహసీల్దారు అనిల్‌కుమార్ రెవెన్యూ ఉద్యోగులను ఘనంగా సత్కరించి మెమోంటోలను అందజేశారు. జెడ్పీటీసీ అర్జా వెంకటనగేష్, పాల్గొన్నారు.

నాగాయలంక:ప్రభుత్వానికి సర్వదా ఆదాయం సమకూర్చే రాజసం కలిగిన మహోన్నతమైనది రెవెన్యూ వ్యవస్థ మాత్రమేనని మెప్మా పీడీ, నియోజకవర్గం ప్రత్యేక అధికారి పి.సాయిబాబు తెలిపారు. తహసీల్దార్ ముప్పిరిశెట్టి హరనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. అవనిగడ్డ తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావును సన్మానించారు. డెప్యూటీ తహసీల్దార్ అబ్దుల్ రఫీ తదితరులు పాల్గొన్నారు. కృత్తివెన్ను, బంటుమిల్లి, ఘంటసాల, గూడూరు, మోపిదేవి మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్‌లు సోమేశ్వరరావు, కేవీ పూర్ణచంద్రరావు, రాజ్యలక్ష్మి, బి.విజయ ప్రసాద్,శ్రీవిద్య, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. పలువురు ఉద్యోగులను సత్కరించారు.

యోగాతో ఆరోగ్యవంతమైన సమాజం

సీనియర్ సివిల్ జడ్జ్ రామకృష్ణయ్య



యోగాసనాలు చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జ్ రామకృష్ణయ్య, తదితరులు

మచిలీపట్నంటౌన్: శారీరక, మానసిక దృఢత్వానికి యోగ ఎంతగానో తోడ్పడుతుందని కృష్ణా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వి.రామకృష్ణయ్య తెలిపారు. ఆంధ్రప్రదేశ్ యోగ సభ ఆధ్వర్యంలో నగరంలోని గాంధీనగర్‌లోని ఉదయపు నడక మిత్రమండలి భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన యోగా శిక్షణ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో, మనుషుల ప్రవర్తనలో మార్పు కోసం యోగా కేంద్ర బిందువుగా పని చేస్తుందని పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో యోగ దైనందిన కార్యక్రమంగా రూపొందించుకోవాలని సూచించారు. యోగ కూడా ఖగోళ శాస్త్రం, జీవశాస్త్రం లాగా ఒక శాస్త్రమన్నారు. మన భారత దేశంలో పతంజలి మహర్షి యోగా శాస్త్రాన్ని ఒక పద్ధతి ప్రకారం ప్రవేశపెట్టారన్నారు. ఆ తర్వాత చాలామంది రుషులు వారి శైలిలో రకరకాలుగా అభివృద్ధి చేసి మనకు అందించారన్నారు. కార్యక్రమంలో మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ, సమాచార పౌర సంబంధాల శాఖ డెప్యూటీ డైరెక్టర్ ఎం. వెంకటేశ్వర్ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ యోగ సభ ప్రతినిధులు రామిశెట్టి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ యోగ సభ గురువులు ఘంటసాల గురునాథ బాబు, మద్దాల చింతయ్య, వడ్డి శ్రీనివాస్, శీలం రమేష్, యారా జగన్మోహన్ రావు, పలువురు యోగా సభ్యులు యోగ కార్యక్రమాలను నిర్వహించి వాటి ప్రాముఖ్యతను తెలియజేశారు.

యోగాతో రుగ్మతలు దూరం
ఐసీడీఎస్ పీడీ రాణి

మచిలీపట్నంటౌన్:యోగ సాధనతో రోగాలు దరిచేరవని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఎంఎస్ రాణి అన్నారు. ఐసీడీఎస్ మచిలీపట్నం ప్రాజెక్టు కార్యాలయం వద్ద శుక్రవారం యోగ సాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు యోగ సాధన చేస్తే ఆరోగ్య సమస్యలను దూరం చేసుకునే అవకాశం ఉందన్నారు. ప్రతి రోజూ కనీసం అరగంట సమయాన్ని యోగకు కేటాయిస్తే మంచి ఆరోగ్య ఫలితాలను చూడవచ్చని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, అధికారులతో యోగ గురువు రేవతి యోగాసనాలు చేయించి ఆసనాల విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ మచిలీపట్నం ప్రాజెక్టు సీడీపీఓ కె గ్లోరి, సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.